క్లుప్తంగా

బస్సు ఢీకొని వ్యక్తి మృతి



పట్నంబజారు: నగరంలో ఓ ప్రైవేటు కళాశాల బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా నకరికల్లు మండలానికి చెందిన సురభి వెంకట్రావు (38) గుంటూరు నగరంలోని సిద్ధార్థ నగర్‌లో నివాసం ఉంటూ కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొరిటిపాడు వైపు నుంచి బుధవారం గుజ్జనగుండ్లవైపు వెళుతున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేటు కళాశాల బస్సు వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మంగళా శాసన పఠనం శుభకరం



పాత గుంటూరు: నిత్యం శ్రీ వేంకటేశ్వరస్వామి మంగళా శాసన పఠనం అత్యంత శుభకరమని ఆధ్యాత్మిక ప్రవచకులు కె.వి.కోటేశ్వరరావు అన్నారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై బుధవారం అణ్ణన్ స్వామి రచించిన శ్రీ వేంకటేశ సుప్రభాతంలోని నాలుగో భాగమైన శ్రీ వేంకటేశ మంగళశాసనంపై ఆయన ప్రవచనం చేశారు. ఆలయ అధ్యక్షుడు సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోటేశ్వరరావు ప్రవచనాన్ని ప్రారంభిస్తూ శ్రీ వేంకటేశ్వర మంగళాశాసనంలోని శ్లోకాల్ని భక్తులతో పలికిస్తూ, వాటిలోని అంతరార్థాలు, పరమార్థాలను వివరించారు. కార్యక్రమంలో మన్నవ రవిప్రసాద్, టి.సి. కేశవరావు, మురికిపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.

మహిళా సాధికారత బీజేపీతోనే సాధ్యం



గుంటూరు మెడికల్: మహిళ సాధికారత బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ అన్నారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శక్తివందన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ మహిళ సాధికారత అంటే మహిళలను గౌరవించడమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మహిళలకు పురుషులతోపాటు అన్ని హక్కులు కల్పించారన్నారు. గిరిజన మహిళను భారత రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతోందని పేర్కొన్నారు. మహిళ రిజర్వేషన్ బిల్లు తీసుకొచ్చిందని, వారి సంక్షేమం కోసం బీజేపీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్, మహాలక్ష్మి, కళ్యాణి, లక్ష్మీమౌనిక, లక్ష్మీ ప్రసన్న, వాణి వెంకట్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు సత్వరమే కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వం టిడ్కో ఇళ్లల్లో తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ నేతలు కోరారు. బుధవారం అడవితక్కెళ్లపాడులోని టిడ్కో ఇళ్లను బీజేపీ రాష్ట్ర అధికారప్ర తినిధి వల్లూరి జయప్రకాష్‌నారాయణ, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏపీకి 22 లక్షల ఇళ్లు ఇచ్చిందని, నేటికీ సగం ఇళ్ల నిర్మాణం కూడా పూర్తి చేయక పోవడం దారుణమన్నారు. బీజేపీ నేతలు ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, అనుమోలు ఏడుకొండలు, వెంకటేష్ యాదవ్, మాదాల సురేష్, దేవ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు బుధవారం సిబార్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంత వైద్యులు ఆర్. శ్రీనివాసరావు, ఎం. వెంకటేష్, బి. బ్లెస్సీ, ఎస్ ప్రియాంకబి. సింధూష బృందం 400 మంది విద్యార్థుల దంతాలను పరీక్షించారు. దంత సంరక్షణకు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ సత్యనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు పర్యవేక్షించారు.

వ్యక్తిపై పలువురు దాడి

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై పలువురు దాడిచేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళగిరికి చెందిన బెజ్జం రాజాజీ గుంటూరు చుట్టుగుంట సెంటర్ ఏసుభక్త నగర్ 1వ లైనులో సువర్ణ ధరణి డెవలపర్స్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. బుధవారం కార్యాలయంలో ఉన్న సమయంలో ఏడుగురు ముఖాలకు కర్చీఫ్‌లు, తలకు టోపీలు ధరించి కార్యాలయంలోకి వచ్చారు. విజయవాడకు చెందిన శైలజపై పెట్టిన కేసులో రాజీ పడాలని బెదిరించారు. అందుకు రాజాజీ ఒప్పుకోకపోవడంతో దాడి చేశారు. చుట్టుపక్కల వారు వచ్చే సమయానికి వారు పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కా ప్రణాళికతో నగరాభివృద్ధి

- ప్రజల సమస్యలను టీడీపీ గాలికొదిలేసింది
- విద్యానగర్‌లో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- 43వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన



రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి రజిని, చిత్రంలో ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి తదితరులు

పట్నంబజారు: గుంటూరు నగరాన్ని అభివృద్ధి చేసింది ఎవరో ప్రజలందరికీ తెలుసునని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలోని 43వ డివిజన్ విద్యానగర్, సుగాలి కాలనీల్లో బుధవారం పలు పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ గుంటూరు నగరంలో రహదారుల్ని అత్యంత నాణ్యతతో నిర్మిస్తున్నామని తెలిపారు. విద్యానగర్ రెండో లైను ప్రధాన రహదారిని ఏకంగా రూ.50 లక్షలతో నిర్మించి ప్రారంభించినట్లు చెప్పారు. సుగాలి కాలనీలో రూ.45 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణంతో పాటు రూ.25 లక్షలతో, రూ.3 లక్షలతో రెండు రోడ్లకు శంకుస్థాపన చేసినట్లు వివరించారు. గుంటూరును శరవేగంగా అభివృద్ధి చేసేలా పక్కా ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో యూజీడీ పనుల పేరుతో రోడ్లన్నింటినీ ఇష్టారాజ్యంగా తవ్వి పడేశారని, వాటిని పూడ్చకుండా ఎక్కడి గుంతల్ని అక్కడే వదిలేశారని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం వచ్చాక నగరంలో కోట్ల రూపాయలు వెచ్చించి పలు ప్రధాన రహదారుల్ని నిర్మిస్తున్నామని మంత్రి రజిని తెలిపారు. ప్రధానంగా గుంటూరు వెస్ట్ పరిధిలో బ్రాడీపేట ఒకటో లైను, కొరిటిపాడు మెయిన్ రోడ్డు, రామనామ క్షేత్రం రోడ్డు, పట్టాభిపురం మెయిన్ రోడ్డు.. ఇలా పలు రహదారుల్ని గొప్పగా తీర్చిదిద్దామని వివరించారు. కళ్లుండీ చూడలేని పార్టీ టీడీపీ అని ధ్వజమెత్తారు. నగర ప్రజలంతా తాము చేస్తున్న అభివృద్ధిని గమనిస్తూనే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో తమకు మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు.

✦ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ గొప్ప పరిపాలన అందించిన జగనన్నకు జనం జేజేలు పలుకుతున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

✦ నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉందని తెలిపారు. గతంలో ఎప్పుడూ, ఎవరూ అందించని గొప్ప పరిపాలనను జగనన్న ప్రజలకు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి సతీష్‌రెడ్డి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పలు ప్రభుత్వ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్నను గెలిపించేందుకు ప్రజలు సిద్ధం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. చంద్రమౌళీ నగర్ ప్రధాన రహదారిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం సిద్ధం సభకు సంబంధించి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సన్నాహక ఏర్పాట్లపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి సిద్ధం సభకు తరలి వెళ్లేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, ఏకంగా 15 వేల మందికిపైగా ఈ సభకు హాజరయ్యే అవకాశం ఉందని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు, పార్టీ ముఖ్య నేత విడదల గోపి కమిటీలో ఉంటారని తెలిపారు. ఆయా డివిజన్ల బాధ్యత వీరు తీసుకుంటారని, వీరి ఆధ్వర్యంలో జన సమీకరణ ఉంటుందని చెప్పారు. ఏర్పాట్ల బాధ్యత కూడా వీరిదేనని స్పష్టం చేశారు.

రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



మంత్రి రజిని, ఎమ్మెల్యేలు రోశయ్య, గిరికి హారతులు పడుతున్న ప్రజలు

పట్నంబజారు: సంక్షేమమే సంకల్పంగా ముందుకు సాగిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 45వ డివిజన్ పరిసర ప్రాంతాల్లో బుధవారం మనతో మన రజినమ్మ కార్యక్రమం నిర్వహించారు. పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కిలారి రోశయ్య, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలసి ఆయా ప్రాంతాలన్నీ మంత్రి రజిని కలియ తిరిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు.

మరోసారి ఆశీర్వదించండి: ఎమ్మెల్యే కిలారి

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థిగా తనను, పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు నియోజకవర్గాల అభ్యర్థుల్ని ఆశీర్వదించాలని పొన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కిలారి రోశయ్య కోరారు. వైఎస్సార్ సీపీని గెలిపించుకోవడమంటే సంక్షేమాన్ని ఇంటికి తీసుకు రావడమేనన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు మారుతి, కోటిలింగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

నగరంలో ఆహ్లాదకరంగా పార్కులు



పార్కును ప్రారంభిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరంలో ఆహ్లాదకరమైన వాతావరణం, పచ్చదనం పెంపునకు పలు పార్కుల్ని అభివృద్ధి చేస్తున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని 3వ డివిజన్ బాలాజీ నగర్‌లో వంగవీటి మోహన్ రంగా నగరపాలక సంస్థ పార్కును రూ.35 లక్షలతో, 9వ డివిజన్ ఆంజనేయ స్వామి టెంపుల్ వద్ద పాత్తూరి లక్ష్మయ్య పార్కును రూ.31 లక్షలతో నగరపాలక సంస్థ అభివృద్ధి చేసింది. పార్కులను బుధవారం మేయర్ కావటి, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పార్కుల్లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు, గ్రీనరితో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే నగరంలోని అనేక పార్కులను ఆధునిక హంగులతో అభివృద్ధి చేశామన్నారు. ముఖ్యంగా గాంధీ పార్కును ఆకర్షణీయంగా తీర్చిదిద్దామని చెప్పారు. నూరి ఫాతిమా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎటు చూసినా అభివృద్ధి కనిపిస్తోందన్నారు. ముందుగా శిలా ఫలకాన్ని ఆవిష్కరించి, పార్క్ ప్రధాన ద్వారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోలవరపు జ్యోతి, ఇర్రి ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటేశ్వరరావు, ఇర్రి సాయి, రాచమంటి భాస్కర్, తోట ఆంజనేయులు, నగర పాలక సంస్థ ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ శ్రీధర్, ఏడీహెచ్ రామారావు, ఇంజినీరింగ్ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్ర పరిశోధనలకు అధిక ప్రాధాన్యం



సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

వీసీ ఆచార్య పి. రాజశేఖర్

ఏఎన్‌యూ: భౌతిక శాస్త్ర పరిశోధనలకు అధిక ప్రాధాన్యం ఉంటుందని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. వర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'మెటీరియల్ సైన్స్ అండ్ క్యారెక్టరైజేషన్స్ టెక్నిక్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ మెటీరియల్ సైన్స్‌పై విస్తృత పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ అధ్యాపకులు ఆచార్య సీకే జయశంకర్ కీలకోపన్యాసం చేస్తూ నేడు సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి పెరుగుతోందని, ఇందులో భౌతిక శాస్త్రంపై ఆసక్తి రెట్టింపు అవుతుందని చెప్పారు. దీనికి కారణం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న నూతన పరిశోధనలేనన్నారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించి కొత్త అంశాల్ని కనుగొనాల్సిన అవసరం ఉందని చెప్పారు. డైరెక్టర్ ఆచార్య ఎం. రామిరెడ్డి సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.గంగాధరరావు, సదస్సు కో- డైరెక్టర్ సంధ్యకోలే, కోశాధికారి జి. నాగరాజు, అధ్యాపకులు సీహెచ్. రవికుమార్, ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, సీహెచ్. లింగరాజు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అధ్యాపకులు మారం పార్థసారథి, హైదరాబాదు ఏఆర్‌సీఐ అధ్యాపకులు మణికార్తి, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ అధ్యాపకులు కె.వెంకటాచలం తదితరులు ప్రసంగించారు. సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు.

పరిశోధనల్లో నూతన పద్ధతులు అవలంబించాలి

పరిశోధనా రంగంలో నూతన మెలకువలు, పద్ధతులను అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో 'అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ మెథడాలజీ' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయస్థాయి వర్క్‌షాప్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశోధన ఫలితాలు సమాజాభివృద్ధికి, మానవాభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ద్రవిడియన్ యూనివర్సిటీ అధ్యాపకులు డి. శ్రీనివాస కుమార్ కీలకోపన్యాసం చేశారు. పరిశోధన పద్ధతుల్లో ప్రధానంగా శాంపిలింగ్ మెథడ్ వినియోగించాలని సూచించారు. డైరెక్టర్ పి.బ్రహ్మాజీరావు వర్క్‌షాప్ ఉద్దేశాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. స్వరూపారాణి, ఎడ్యుకేషన్ విభాగ చైర్ పర్సన్ జె.ఆర్. ప్రియదర్శిని, ఏ. చంద్రమోహన్, ప్రొఫెసర్లు బి. పద్మనాభయ్య, వి. లాజర్, టి. షారోన్ రాజు, వి. రవి, కె. సుమలత, జి. చక్రవర్తి, జె. సూరజ్ మోహన్, వర్క్‌షాప్ నిర్వాహక కార్యదర్శి ఎం. వసంతరావు, సభ్యులు టి. సందీప్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన వేగవంతం

అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



నెహ్రూనగర్: నగరంలోని తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన వేగంగా పూర్తి చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లపై ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజరీ అధికారులు, ఏఈల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఇప్పటి వరకు చేపట్టిన మౌలిక వసతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, వికలాంగులకు వీలుగా ర్యాంపులు, విద్యుత్, తాగునీటి సరఫరా, మరుగు దొడ్లు వంటి కనీస వసతుల్ని ఎక్కడ కల్పించాలో గుర్తించామని, వాటి ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏఈల వారీగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బీఎల్ఓలు, సూపర్‌వైజరీ అధికారులు ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లోని పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్ఓలు పరిశీలించి, ర్యాంప్‌లు, విద్యుత్ వంటి వసతుల ఏర్పాటు చేయించాలని సూచించారు. కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం పరిశీలించాలని, మరుగుదొడ్లకు వెంటనే మరమ్మతులు చేయించాలని తెలిపారు. సమావేశంలో ఏఈఆర్ఓ వెంకటలక్ష్మి, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, ఏసీపీ అజయ్ కుమార్, డీఈఈలు రాము, శ్రీధర్, టీపీఎస్ నాగవల్లి, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలపై ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాపై అందిన ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై ఏఈఆర్ఓలు, సూపరింటెండెంట్లతో బుధవారం కమిషనర్ కీర్తి చేకూరి తన చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అర్జీల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని ఆదేశించారు. గడువు అనంతరం పెండింగ్ ఉన్నవారి వివరాలతో బీఎల్ఓల వారీగా నివేదిక ఇవ్వాలని ఆమె చెప్పారు. సూపర్‌వైజరీ అధికారులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, ఎప్పటికప్పుడు పరిష్కారం చేసేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఇతర నియోజకవర్గాల అర్జీలు ఆన్‌లైన్ ద్వారా అందితే సంబంధిత నియోజకవర్గ అధికారులతో సమన్వయం చేసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఏఈఆర్ఓలు సీహెచ్.శ్రీనివాస్, వెంకట లక్ష్మి ప్రదీప్ కుమార్, శ్రీనివాస్, నిరంజన్, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఏఐతో దీర్ఘకాలిక వ్యాధులకు చెక్

- దీర్ఘకాలిక వ్యాధులకు డిజిటల్ థెరపటిక్స్ చికిత్సతో ఎంతో మేలు
- ఏపీలో మొట్టమొదటిసారిగా ప్రారంభం
- డాక్టర్ హరికృష్ణ వెల్లడి



డాక్టర్ మహేష్ నంబియార్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్న డాక్టర్ రేవూరి హరికృష్ణ

గుంటూరు మెడికల్: ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ద్వారా నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) ను ముందుగానే గుర్తించి కట్టడి చేయవచ్చని ధృతి హాస్పిటల్స్ అధినేత, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ రేవూరి హరికృష్ణ అన్నారు. గుంటూరు కొత్తపేటలోని హాస్పిటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. థైరాయిడ్, డయాబెటిస్, హైపర్‌టెన్షన్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులతోపాటు కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్, ఒబెసిటీ లాంటి వ్యాధులతో బాధపడుతున్నవారికి డిజిటల్ థెరపటిక్స్ అనే అత్యాధునిక వైద్య చికిత్స ఒక వరం లాంటిదని తెలిపారు. ఈ వైద్య విధానంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి శరీరంలో సెన్సార్ బిగిస్తామన్నారు. తద్వారా బాడీ మెటాలిజం తెలుసుకుని చికిత్స అందిస్తామని వివరించారు. శరీరంలో ప్రస్తుతం ఉన్న దీర్ఘకాలిక వ్యాధుల పరిస్థితి తెలుసుకుని క్రమక్రమంగా వాటిని నియంత్రించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. ఎన్‌సీడీ వ్యాధులకు డ్రగ్, డైట్, డిసిప్లేన్ మూడు తప్పనిసరిగా ఉండాలని, వీటన్నింటిని ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి డిజటల్ థెరపటిక్స్ ద్వారా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించి వైద్యులు చికిత్స అందిస్తారని చెప్పారు. నూతన విధానంతో దీర్ఘకాలిక వ్యాధుల్ని ముందస్తుగానే తెలుసుకుని కట్టడి చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం వ్యాధులతో బాధపడుతున్నవారికి పూర్తి నియంత్రణలో వాటిని పెట్టడం సాధ్యమవుతోందని పేర్కొన్నారు. డిజిటల్ థెరపటిక్స్‌పై ఇండియాలో 20వేల మందిపై పరిశోధన చేసి నిరూపితమైన తరువాత వినియోగంలోకి తీసుకొచ్చామని డాక్టర్ హరికృష్ణ చెప్పారు. ఏపీలో మొట్టమొదటిసారిగా తమ హాస్పటల్‌లో నూతన చికిత్సా విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. ట్విన్ హెల్త్ అసోసియేట్ డైరెక్టర్ మహేష్ నంబియార్‌తో డిజిటల్ థెరపటిక్స్ వైద్య విధానంపై ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు.

విద్యారంగంలో నూతన ఒర'బడి'

- ఘన చరిత్ర సొంతం చేసుకున్న శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాల
- రేపు వార్షికోత్సవం




శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యారంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం జరగనుంది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు క్రమశిక్షణతో నాణ్యమైన విద్యను అందించేందుకు స్థాపించిన పాఠశాల ఆధునిక కాలానికి అనుగుణంగా అత్యాధునిక విద్యకు చిరునామాగా మారింది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త పాటిబండ్ల సీతారామయ్య పేరుతో 1962లో గుంటూరులోని లక్ష్మీపురంలో స్థాపించిన శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాల గత నాలుగేళ్లగా సీబీఎస్ఈ విధానంలోకి మారి, వందలాది మంది విద్యార్థులతో విరాజిల్లుతోంది. శుక్రవారం జరగనున్న వార్షికోత్సవ వేడుకలకు మిజోరం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

దేశ, విదేశాల్లో పూర్వ విద్యార్థులు

పాఠశాలలో చదివిన ఎంతో మంది పూర్వ విద్యార్థులు దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారు. పాటిబండ్ల సీతారామయ్య ఆశయానికి తగిన విధంగా పాఠశాలను నడుపుతున్న పాలకవర్గం ఆధునిక కాలానికి అనుగుణంగా సీబీఎస్ఈ సిలబస్‌లోకి మారి అత్యాధునిక వసతులతో క్రమశిక్షణకు పెద్దపీట వేసి, విలువలతో కూడిన ఆధునిక విద్యను అందిస్తోంది. లండన్ ప్రభుత్వం నుంచి ఐఎస్ఓ ఈవో ఎంఎస్ 21001:2018 సర్టిఫికేషన్‌తో పాటు గుంటూరు నగరపాలక సంస్థ నుంచి స్వచ్ఛ భారత్ అవార్డు లభించింది. విద్యతోపాటు అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతూ, అత్యాధునిక లేబరేటరీలు, డిజిటల్ లైబ్రరీ వంటి సదుపాయాలతో కార్పొరేట్ పాఠశాలలకు మించి విద్యాబోధన, అధునాతన విద్యా విధానాన్ని అమల్లోకి తెచ్చినట్లు పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు చెప్పారు. విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యనందించడంతోపాటు, మానసిక ఉల్లాసం కోసం యోగ, క్రీడలు, డ్రాయింగ్, కర్ర సాము, కరాటే వంటి ఎన్నో క్రీడల్లో శిక్షణ కల్పిస్తున్నట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ చెప్పారు. ప్రతిరోజు యోగా, మెడిటేషన్, ఇండోర్ గేమ్స్, సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్.. ఇలా అనేక క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామని అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు పేర్కొన్నారు.

చిరు ప్రయత్నంతో పారిశ్రామికవేత్తలుగా ఎదిగిన ప్రముఖులు



విజేతలకు బహుమతి అందజేస్తున్న శ్రీధర్, ఎస్వీ రమణ, లలిత తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశంలో ఎంతో మంది ప్రముఖులు చిరు ప్రయత్నం, స్థిరమైన ఆలోచనలతో పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టి ఉన్నత స్థాయికి ఎదిగారని హరి జ్యూయలర్స్ అధినేత శ్రీధర్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో '' సృజన మీలో.. ఎవరు ఎంట్రప్రెన్యూర్'' పేరుతో రెండు రోజులపాటు నిర్వహించిన పోటీలు బుధవారం ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్ మాట్లాడుతూ వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లడం ద్వారా విద్యార్థులు వ్యవస్థాపకులుగా రాణించవచ్చునని పేర్కొన్నారు. ఉత్సాహవంతులైన, ప్రతిభ గల యువతరం శ్రమను జోడించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. విద్యావంతులైన యువతరం నూతన ఆవిష్కరణల దిశగా శ్రీకారం చుట్టినందువల్లే ఈ దశాబ్దానికి ఆవిష్కరణ దశాబ్దం అనే పేరు వచ్చిందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యార్థులు సొంత స్టార్టప్, వెంచర్లను ప్రారంభించడంలో మక్కువ చూపే విధంగా వారిలో వ్యవస్థాపక లక్షణాలను అభివృద్ధి పర్చి, బలోపేతం చేయడమే తమ కళాశాల ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ఈ సందర్భంగా రెండు రోజుల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, విభాగాధిపతి వి. చక్రవర్తి, సహాయాచార్యులు ఏ.బాజీబాబు, సీహెచ్. వేదవతి, ఎస్. మణికంఠ, బి. అనిత, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మానవతా విలువలు అలవర్చాలి

న్యాయమూర్తి రామకృష్ణ ప్రసాద్



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు మానవతా విలువలు తల్లిదండ్రుల నుంచే అలవడతాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని అక్మే కిడ్స్ పాఠశాల వార్షికోత్సవంతో పాటు పాత్తూరులోని క్యాంపస్‌లో కిడ్స్ కార్నివాల్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్స్ కార్నివాల్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లల్నిసరైన పద్ధతిలో పెంచాలని, క్రమశిక్షణతో పాటు విలువల్ని అలవర్చడంలో తల్లిదండ్రులే మొదటి గురువుగా ఉండాలని చెప్పారు. ఉద్యోగాలతో బిజీగా ఉంటున్నప్పటికీ తల్లిదండ్రులు కొంత సమయాన్ని పిల్లలతో గడపాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అభ్యుదయ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ బీఎస్సార్కే ప్రసాద్, పాఠశాల డైరెక్టర్లు నందమూరి సొగంధ్ కృష్ణ, నందమూరి దీప్తి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణాన్ని పరిరక్షించుకునే బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర మానిటరింగ్ అధికారిణి జి. ప్రభ పేర్కొన్నారు. నగరంలోని స్టెమ్, లయోలా, శ్రీవేంకటేశ్వర బాలకుటీర్, శ్రీ పాటిబండ్ల సీతారామయ్య, లిటిల్ ఫ్లవర్స్, కేఎల్‌పీ, సెయింట్ ఆన్స్ పాఠశాలల్ని బుధవారం సందర్శించిన ఆమె విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రించాలని సూచించారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో పర్యావరణ విద్య కార్యక్రమాన్ని విద్యాసంస్థల్లో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థికీ మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు పి.వెంకటేశ్వరరావు, జ్యోతికిరణ్, నాగేంద్రమ్మ, గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త షేక్ గౌసుల్ మీరా, ఉపాధ్యాయుడు ధనయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ, శివకుమార్ ఆయా పాఠశాలల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.